సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



ఏఎస్పీగా విక్రాంత్ కుమార్

భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 8లో



లక్ష్యం చేరేనా?

వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోనందున ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేనని తెలుస్తోంది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 31° / 18°

వాతావరణం

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఎండ ప్రభావం అధికంగానే ఉంటుంది. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ స్కాలర్‌షిప్ వివరాలు సమర్పించండి

కొత్తగూడెంరూరల్ : జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్, మెడికల్ ఇతర కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల వివరాలు అందజేయాలని బీసీ సంక్షేమాధికారి ఇందిర తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2017 – 18 నుంచి 2024 – 25 వరకు ఉపకార వేతనాల హార్డ్ కాపీలను జనవరి 20లోగా తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సింగరేణిలో 'నూతన' వేడుకలు రద్దు

సింగరేణి(కొత్తగూడెం): మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతితో రాష్ట్ర ప్రభుత్వం వారంరోజులపాటు సంతాప దినాలుగా ప్రకటించిందని, దీంతో సింగరేణిలో నూతన సంవత్సర వేడుకలు రద్దు చేస్తున్నామని పర్సనల్ జీఎం (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కోడూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'ఇస్రోస్టాట్'కు సింగరేణి కళాశాల ఎంపిక

సింగరేణి(కొత్తగూడెం): ఇస్రోస్టాట్ ప్రోగ్రామ్‌కు కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎంపికై ందని, నోడల్ అధికారిగా డాక్టర్ జి.శైలజ (కెమిస్ట్రీ హెచ్‌ఓడీ) ఎంపికయ్యారని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పరిశోధనలపై అవగాహన కల్పించేందుకు ఇస్రో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తోందని, ఈ క్రమంలో సింగరేణి విద్యాసంస్థలను సెంటర్ ఫర్ ఎక్సలెన్సీగా తీర్చిదిద్దేందుకు దరఖాస్తు చేశామని పేర్కొన్నారు. జనవరి 9 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో శిక్షణ తరగతులు ఉంటాయని, పరీక్షలు కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించి పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తారని వివరించారు.

అంబులెన్స్‌ల్లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న నాగేందర్

ఇల్లెందు: ఇల్లెందులోని 102, 108, 1962 అంబులెన్స్‌లను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్ సోమవారం తనిఖీ చేశారు. వాహనాల రికార్డులు, ఎమర్జెన్సీ కేసుల వివరాలపై ఆరా తీశారు. జీపీఎస్ ట్యాబ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. అంబులెన్స్‌లోని మందులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఎంటీ రేణుకాదేవి, పైలట్ శ్రీనివాస్, సునీల్, సాయి పాల్గొన్నారు.


భద్రత పెంచుతాం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ప్రజలకు ఎస్పీ రోహిత్‌రాజు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు. సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆయన పలువురి ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలో చేపడుతున్న భద్రతా చర్యలను వివరించారు. ఫోన్ ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యలు నోట్ చేసుకుని, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- నేటి రాత్రి వేళ కట్టుదిట్టమైన చర్యలు
- నిర్విరామంగా పెట్రోలింగ్ చేపడతాం
- బాణసంచా కాల్చొద్దు.. డీజేలు పెట్టొద్దు
- సున్నిత ప్రాంతాల్లో గస్తీ పెంచుతాం

'సాక్షి' ఫోన్ ఇన్‌లో ఎస్పీ రోహిత్‌రాజ్

సాక్షి ఫోన్ ఇన్



సాక్షి ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

ప్రశ్న: అర్ధరాత్రి వేళ బాణసంచా కాల్చుతూ, డీజేలతో పెద్ద శబ్దాలు చేస్తున్నారు. దీంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. డిసెంబర్ 31 రాత్రి వీటిని నియంత్రించాలి.

– సీతారాం, నెహ్రూబస్తీ, కొత్తగూడెం

ఎస్పీ: బాణసంచా కాల్చడం, డిస్కో జాకీ(డీజే)లతో పెద్ద శబ్దాలు చేయొద్దని ఇప్పటికే చెప్పాం. ఈ రోజు రాత్రి పెట్రోలింగ్‌లో ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. అయినప్పటికీ మీ ప్రాంతంలో బాణసంచా కాల్చినా, డీజేలు పెట్టినా వెంటనే 100 కి ఫోన్ చేయండి. సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: గతేడాది డిసెంబర్ 31 అర్ధరాత్రి ఇల్లెందు కోర్టు ఏరియాలోని సీఎస్ఐ చర్చి దగ్గర గొడవలు జరిగాయి. ఈసారి ప్రార్థనా స్థలాల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు ?

– సునీల్, జగదాంబ సెంటర్, ఇల్లెందు

ఎస్పీ: నేటి అర్ధరాత్రి జిల్లాలోని అన్ని ప్రముఖ చర్చిల వద్ద భద్రతా పరమైన ఏర్పాట్లు చేయాలని ఆయా పోలీస్‌స్టేషన్లకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. మీరు చెప్పిన చర్చి దగ్గర ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

ప్రశ్న: రాత్రివేళ తిరిగే ఇసుక వాహనాలతో ఇబ్బందిగా ఉంది. డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో రాత్రి వేళ తిరిగే ట్రాక్టర్లను నియంత్రిస్తే బాగుంటుంది.

– భానుప్రకాశ్, మోరంపల్లి బంజర, బూర్గంపాడు మండలం

ఎస్పీ: డిసెంబర్ 31 రాత్రి పిల్లాపాపలతో చర్చిలకు ఎక్కువ మంది వెళ్తుంటారు. ఇలాంటి వాళ్లకు ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు చెబుతాను.

ప్రశ్న: మాది ఇల్లెందు మున్సిపాలిటీలో 8వ వార్డు. గతేడాది డిసెంబర్ 31 రాత్రి మా గల్లీలో గొడవలు జరిగాయి. ఈ సారి అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోగలరు.

ఎస్పీ: మీ ఏరియాలో ఎలాంటి గొడవలు జరగకుండా ఏర్పాట్లు చేస్తాం.

ప్రశ్న: డిసెంబర్ 31 రాత్రి కొందరు యువకులు ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ కేరింతలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుంటారు. ఇలాంటి వారిపై దృష్టి పెట్టాలి. అలాగే జిల్లాలో పీస్ కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి

– ఎండీ యాకూబ్‌పాషా, పాల్వంచ, జిల్లా మైనార్టీ సెల్

ఎస్పీ: డిసెంబర్ 31 రాత్రి సమయంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పెట్రోలింగ్ చేస్తాం. అన్ని పట్టణాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన కూడళ్లతో పాటు అంతర్గత రోడ్లు, వీధుల్లోనూ పెట్రోలింగ్ పెంచుతాం. బ్లూకోల్ట్స్ టీమ్‌లు కూడా పని చేస్తాయి. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌ల విషయంపై దృష్టి పెడతాం. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహిస్తాం. రాత్రి 10 గంటల నుంచి అన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో 'విజిబుల్ పోలీసింగ్' ఉండేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. అవసరమైన చోట పోలీస్ పికెట్ కూడా ఏర్పాటు చేస్తాం. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత బార్లు మూసేయాలని ఇప్పటికే చెప్పాం. మీరు కోరినట్టు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో పీస్ కమిటీ ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెడతాం.

ప్రశ్న: నాకు ఎక్కువగా ఫేక్ కాల్స్ వస్తున్నాయి. ఇబ్బందిగా ఉంది.

– మురళి, కొత్తగూడెం

ఎస్పీ: ఒకసారి మా కార్యాలయానికి వచ్చి పూర్తి వివరాలు అందించండి. తగు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: అశ్వారావుపేటలో ఇసుక మాఫియాతో వాగులు ఖాళీ అవుతున్నాయి. ఫిర్యాదు చేసినా సరైన ఫలితం ఉండడం లేదు

– ఉదయ రాఘవేంద్ర, అశ్వారావుపేట

ఎస్పీ: ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ శాఖకు కూడా ఫిర్యాదు ఇవ్వండి. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అక్కడి ఎస్‌హెచ్‌ఓకు చెబుతాను.

ముక్కోటి నాటికి గిరిజన పల్లె!

పనులను పరిశీలించిన ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం సమీపాన నిర్మిస్తున్న గిరిజన పల్లెను ముక్కోటి ఉత్సవం రోజున ప్రారంభిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. పల్లె ఏర్పాటు పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వచ్చే నెల 9, 10వ తేదీల్లో జరిగే సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే ప్రతీ ప్రతీ భక్తుడు మ్యూజియం, గిరిజన పల్లెను సందర్శించేలా భద్రాచలంలోని ముఖ్య కూడళ్లలో బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఇక్కడ పర్యాటకులు, భక్తులకు సంప్రదాయరీతిలో స్వాగతం ఉంటుందని చెప్పారు. ఇక కొండరెడ్ల కుటుంబాలకు సంబంధించిన గృహోపకరణాలు, సెల్ఫీ పాయింట్ ఏర్పాటు, విద్యుత్ దీపాలతో అలంకరణపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీడీ మణెమ్మ, అధికారులు ఉదయ్‌కుమార్, చంగల్‌రావు, మునీర్‌పాషా, హరీశ్, స్పందన, హరికృష్ణ, శ్రీనివాస్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



గిరిజన పల్లె పనులపై ఉద్యోగులకు సూచనలు చేస్తున్న పీఓ రాహుల్

- ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన గిరిజన దర్బార్‌లో పీఓ బి.రాహుల్ పాల్గొన్నారు. వివిధ ఆదివాసీ, గిరిజన గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారంపై యూనిట్ అధికారులకు సూచనలు చేశారు.
- స్నాక్స్, చాట్, గిరిజన సంప్రదాయ, ఇతర వంటకాల తయారీలో ఆసక్తి, అనుభవం ఉన్న అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. గిరిజన మ్యూజియంలో వంట తయారీ కోసం ఆసక్తి ఉన్న అనుభవ ధ్రువపత్రాలతో ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు హాజరు కావాలని సూచించారు.



విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న రామాలయం

నేటి నుంచి 'ముక్కోటి' ఉత్సవాలు..

- తొలిరోజున మత్స్యావతారంలో రామయ్య దర్శనం
- జనవరి 10 వరకు నిత్యకల్యాణాలు రద్దు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం నుంచి ముక్కోటి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలకు భద్రగిరి ముస్తాబైంది. స్వామివారు రోజుకొక అవతారంలో దర్శనమివ్వనుండగా.. సీతాలక్ష్మణ సమేత రామయ్యను కొలువుదీర్చేందుకు మిథిలా స్టేడియంలో ప్రత్యేక వేదిక సిద్ధమైంది. జనవరి 20 వరకు అధ్యయనోత్సవాలు, 21 నుంచి 23 వరకు విలాసోత్సవాలు, 26న సర్వదేవతా అలంకారమైన విశ్వరూప సేవ నిర్వహించనున్నారు.

వేడుకలకు సర్వం సిద్ధం..

వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని రామాలయాన్ని, భద్రాచలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. బ్రిడ్జి సెంటర్, అభయాంజనేయస్వామి పార్క్, సూపర్‌బజార్ సెంటర్, మిథిలా స్టేడియం వద్ద ఇప్పటికే స్వాగత ద్వారాలు ఏర్పాటుచేశారు. రామాలయం, మిథిలా స్టేడియం పరిసర ప్రాంతాల్లో షామియానాలు, చలువ పందిళ్లు వేశారు. మిథిలా స్టేడియంలో స్వామి వారు కొలువుదీరే వేదికను ప్రత్యేకంగా అలంకరించారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో రామాలయం వెలుగొందుతోంది. తెప్పోత్సవానికి హంస వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు.

నేటి అవతార విశిష్టత..

అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారిని మంగళవారం మత్స్యావతారంలో అలంకరించనున్నారు. శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాల్లో ఇది మొదటిది. ఈ అవతారానికి సంబంధించి రెండు గాథలు పురాణాల్లో ఉన్నాయి. మొదటిది జ్ఞాననిధులైన బ్రహ్మ నుంచి అపహరించి సముద్రంలో దాగి ఉన్న సోమకాసురిని సంహరించడానికి మత్స్యావతారం ధరించి, వేదాలను ఉద్ధరించాడని, రెండోది జలప్రళయం నుంచి నావలో ఉన్న వైవస్వత మనువును, సప్తరుషులను, సృష్టికి అవసరమైన విత్తనాలను, ఔషధాలను రక్షించాడని పండితులు చెబుతున్నారు. ఈ అవతారంలో స్వామిని పూజిస్తే కేతు గ్రహ బాధలు తొలగుతాయని ప్రతీతి.

సాంస్కృతిక కార్యక్రమాలు..

ఉత్సవాల సందర్భంగా నిత్యం గోదావరి తీరం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఇక మిథిలా స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు సాంస్కృతిక, హరికథ కార్యక్రమాలు ఉంటాయి. తొలిరోజు మంగళవారం స్థానిక, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, వరంగల్‌కు చెందిన కళాకారులతో కూచిపూడి, సంగీత, భజన కార్యక్రమాలు, రాత్రి 9.15 గంటల నుంచి 11 గంటల వరకు పర్నూరు నాగాంజనేయ నాట్యమండలి వారిచే 'శ్రీకృష్ణ రాయభారం' నాటక ప్రదర్శనలు ఉంటాయి.



వేడుకలకు సిద్ధమైన మిథిలా స్టేడియం

నేడు మత్స్యావతార రూపుడై..

అధ్యయనోత్సవాల్లో భాగంగా తొలిరోజు మంగళవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. జనవరి 8 వరకు రోజుకో అవతారంలో ప్రత్యేక పూజలందుకున్నాక 9వ తేదీ సాయంత్రం పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం, 10న ఉత్తర ద్వార దర్శన వేడుకలు ఉంటాయి. పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి 10వ తేదీ వరకు బేడా మండపంలో జరిగే నిత్యకల్యాణాలు రద్దు చేశారు.

53 రోజులు.. రూ.1.70 కోట్లు

రామాలయంలో హుండీల లెక్కింపు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ హుండీలను సోమవారం చిత్రకూట మండపంలో లెక్కించారు. రూ. 1,71,20,321 నగదుతో పాటు 92 గ్రాముల బంగారం, కేజీ 485 గ్రాముల వెండి లభించాయని ఈఓ రమాదేవి వెల్ల డించారు. ఇంకా యూఎస్ఏ డాలర్లు 923, ఆస్ట్రేలియా డాలర్లు 165, సింగపూర్ డాలర్లు 12, కెనడా నగదు 20, ఇంగ్లండ్ పౌండ్లు 5 తదితర విదేశీ నగదు వచ్చిందని పేర్కొన్నారు. గత నవంబర్ 7న హుండీలు లెక్కించగా.. 53 రోజుల తర్వాత తిరిగి తెరిస్తే ఈ మొత్తం లభ్యమైందని వివరించారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ..

శ్రీ సీతారామచంద్రస్వామి వారిని సోమవారం ముత్తంగి రూపంలో అలంకరించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి వితరణ..

ఆలయ సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌లోని అమీన్‌పూర్‌కు చెందిన బాపురావు, సుబ్బాయమ్మ దంపతులు రూ.లక్ష విరాళం అందించారు.

పోలీసింగ్‌లో భేష్

- రాష్ట్ర స్థాయిలో ఆరు విభాగాల్లో నాలుగింట జిల్లా ప్రథమం
- గతేడాదితో పోలిస్తే పెరిగిన నేరాలు
- మావోయిస్టుల అణచివేతలో మెరుగైన ఫలితాలు
- వార్షిక నివేదికలో ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పోలీస్ శాఖకు సంబంధించి ఫిర్యాదు చేయడం నుంచి నేరస్తులకు శిక్షపడే వరకు ఆరు ప్రధాన విభాగాల్లో నాలుగింటిలో జిల్లా యూనిట్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ ఏడాది పోలీస్ శాఖకు సంబంధించిన ప్రధాన అంశాలను ఆయన వివరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్ పక్కన డీఎస్పీలు

పెరిగిన నేరాలు..

గతేడాది జిల్లా వ్యాప్తంగా 5,096 కేసులు నమోదు కాగా ఈసారి ఆ సంఖ్య 5,636కు చేరుకుందని ఎస్పీ తెలిపారు. ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు విషయం ఏదైనా కేసు నమోదు చేయడమే ఇందుకు కారణమన్నారు. దీంతో గతేడాదితో పోల్చితే ఈసారి క్రైం రేట్ 6.48 అధికంగా కనిపిస్తోందన్నారు. నేరస్తులకు న్యాయస్థానాల్లో శిక్షలు వేయించడంలో జిల్లా పోలీసులు పురోగతి సాధించారని పేర్కొన్నారు. నగలు, నగదు చోరీల విషయానికొస్తే రూ.3.20 కోట్లకు గాను రూ.1.35 కోట్లు రికవరీ చేయగలిగామని చెప్పారు. సైబర్ క్రైంలో గతేడాది 138 కేసులు నమోదు కాగా ఈసారి 196కు పెరిగిందని, సైబర్ నేరాల్లో రూ. 2.50 కోట్లు ఫ్రీజ్ చేయగా రూ.1.30 కోట్లు రీఫండ్ చేశామని అన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం..

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినట్టు ఎస్పీ వెల్లడించారు. గతేడాది 4,700 కేజీల గంజాయి పట్టుకోగా, ఈసారి 8,023 కేజీలు పట్టుబడిందని, మొత్తంగా ఈ ఏడాది 36వేల కేజీల గంజాయిని డిస్పోజ్ చేశామని తెలిపారు. దాని విలువ రూ.90 కోట్లు ఉంటుందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో జాగిలాలను ఉపయోగించామని చెప్పారు. పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా, పేకాటలోనూ గతేడాదితో పోల్చితే ఈసారి కేసుల సంఖ్య పెరిగిందన్నారు. ట్రాఫిక్ ఈ చాలాన్ సైట్ హ్యాక్ కావడంతో డ్రంక్ అండ్ డ్రైవ్, ఈ చాలాన్‌లో గతేడాదితో పోల్చితే కేసుల సంఖ్య 40 శాతం తగ్గిందని తెలిపారు.

దళం అంతరించిపోయింది

యాంటీ మావోయిస్టు ఆపరేషన్లలో ఈ ఏడాది అత్యంత మెరుగైన ఫలితాలు సాధించామని ఎస్పీ వెల్లడించారు. పాల్వంచ – మణుగూరు ఏరియా కమిటీ అంతరించిపోయిందన్నారు. మొత్తంగా 35 మంది మావోయిస్టులు లొంగిపోగా 16 మంది అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆధునిక ఆయుధాలు సీజ్ చేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు.

పెరిగిన నేరాల వివరాలిలా..

నేరం	2024	2023	పెరుగుదల (శాతంలో)
మర్డర్ ఫర్ గెయిన్	1	0	100
డెకాయిట్	2	1	100
రాబరీ	5	0	500
దొంగతనాలు	265	223	18.83
అత్యాచారాలు	89	57	56.14
మోసం	303	260	16.54
రోడ్డు ప్రమాదాలు	220	216	1.85
పోక్సో	105	86	22.09
ఎస్సీ, ఎస్టీ కేసులు	102	84	21.43

తగ్గిన నేరాలు..

నేరం	2024	2023	తగ్గుదల (శాతంలో)
వరకట్న హత్యలు	00	6	600
వరకట్న మరణాలు	03	11	72.73
దొంగనోట్లు	00	01	100
బాడీలీ అఫెన్స్	584	676	13.61
కిడ్నాప్	77	98	21.43
నేరపూరిత హత్యలు	2	05	60.00
క్షణికావేశ హత్యలు	24	26	7.69

అత్యంత సంతృప్తి ఇచ్చిన ఘటన

అశ్వారావుపేట మండలంలో పెద్దవాగుకు వరద వచ్చినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న 40 మందిని కాపాడడం ఇటు వృత్తిపరంగా, అటు వ్యక్తిగతంగా అత్యంత సంతృప్తి ఇచ్చిందని రోహిత్‌రాజ్ అన్నారు. విషయం తెలిసిన వెంటనే డీడీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించడంతో పాటు ఏపీలో ఉన్న తన బ్యాచ్ మేట్ అధికారులతో మాట్లాడి హుటాహుటిన హెలికాప్టర్ ఏర్పాటు చేశానన్నారు.

చాలా బాధపడ్డా..

ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్, కానిస్టేబుల్ సాగర్ బలవన్మరణాలు తనకు అత్యంత బాధ కలిగించాయని ఎస్పీ తెలిపారు. పోలీస్ డ్యూటీ అంటేనే ఒత్తిడి, సవాళ్లతో కూడుకుని ఉంటుందని, దాన్ని ఎలా అధిగమించాలనేది వ్యక్తిగత విషయమని అన్నారు. అయితే ఖాకీల కష్టాలు వినేందుకు ప్రతీ గురువారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని, మోటివేషనల్ స్పీకర్లతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

ప్రజావాణికి పోటెత్తారు..

- ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కలెక్టర్
- సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో తమ సమస్యలపై పలువురు అందించిన వినతిపత్రాలను పరిశీలించాలని, తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమయపాలన పాటించని విద్యుత్‌శాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారం నుంచి సకాలంలో హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏఓను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి కలెక్టర్ పాటిల్ దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటి వివరాలిలా..

- కొత్తగూడెం హనుమాన్ బస్తీకి చెందిన రాజుల సరోజిని తన భర్త ఇటీవల గుండెపోటుతో మరణించాడని, ఇంటి అద్దె చెల్లించలేక పోతున్నామని, ఇందిరమ్మ ఇంటితో పాటు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందించగా హౌసింగ్ శాఖకు ఎండార్స్ చేశారు.
- మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో పశువులు విచ్చలవిడిగా రోడ్లపైన, పొలాల్లో తిరుగుతున్నాయని, పంటలను నాశనం చేస్తున్నాయని, రహదారుల వెంట వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బందెల దొడ్డి నిర్వహణ చేపట్టాలని స్థానికులు ఫిర్యాదు చేయగా మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.
- పాల్వంచలోని శ్రీనివాస బంజారా కాలనీలో తాము 13 ఏళ్లుగా నివసిస్తున్నామని, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సమయంలో తమకు విద్యుత్ మీటర్లు లేవని, కొత్తగా మీటర్లు వచ్చాయని, గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని పలువురు దరఖాస్తు చేయగా విద్యుత్ ఎస్‌ఈకి ఎండార్స్ చేశారు.
- తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అప్పగించాలని కోరుతూ రామవరంలోని 9వ వార్డు కౌన్సిలర్ మోరె రూప ఆధ్వర్యంలో లబ్ధిదారులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్ పాటిల్

క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ములకలపల్లి: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం ఐదో తరగతి ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నట్లు ములకలపల్లి గురుకులం ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీరికి ఫిబ్రవరి 23న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. అలాగే, 6,7,8,9తరగతుల్లో ఖాళీసీట్ల భర్తీకి కూడా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

రౌడీ షీటర్లపై నిఘా

డీఎస్పీ చంద్రభాను



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని, నూతన సంవత్సర వేడుకల్లో గొడవలు జరిగితే అందుకు బాధ్యులైన రౌడీ షీటర్లను పల్లె, పట్టణాల నుంచి బహిష్కరించనున్నట్లు డీఎస్పీ ఎన్.చంద్రభాను హెచ్చరించారు. సోమవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల్లో గొడవలు, మద్యం, గంజాయిలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటామన్నారు. యువకులు డీజే సౌండ్, అధిక స్పీడ్‌తో సవారీలు చేస్తే వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో బాణసంచా సౌండ్ లేకుండా చూడాలన్నారు. తాను ఇల్లెందు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టాక ఈ ప్రాంతంలో సంచరించే ఎన్డీ దళాల ఉనికి లేకుండా చేశామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ సందీప్, నాగుల్ మీరా ఖాన్, సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్(టీఎస్ సీపీఎస్ ఈయూ) రాష్ట్ర కార్యదర్శులుగా జిల్లా నుంచి నలుగురికి అవకాశం దక్కిందని ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన యరమల శ్రీనివాసరెడ్డి, రాగి సురేష్, షేక్ మోబిన్ అహ్మద్, ముత్యాల లక్ష్మణాచారిని రాష్ట్ర కార్యదర్శులుగా నియమించారని వెల్లడించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశిధర్, చర్ల శ్రీనివాసరావుతో పాటు మోహన్, శ్వేత, తదితరులు అభినందించారు.

ఏఎస్ఆర్‌బీలో ఐదో ర్యాంకు

- జాతీయస్థాయిలో సత్తా చాటిన సుబ్లేడు వాసి లత
- 'ఐకార్'లో శాస్త్రవేత్తగా అవకాశం



కుటుంబ సభ్యులతో పోలెపొంగు లత

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు గ్రామానికి చెందిన పోలెపొంగు లత అగ్రికల్చర్ సైంటిస్ట్ రిక్రూట్మెంట్ బోర్డ్ (ఏఎస్ఆర్‌బీ) ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఈమేరకు ప్లాంట్ పాథాలజీ(మొక్కల వ్యాధి అధ్యయనశాస్త్రం) విభాగం ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా ఐదో ర్యాంకు సాధించడం ద్వారా జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐకార్)లో శాస్త్రవేత్తగా అవకాశం దక్కించుకుంది. సుబ్లేడుకు చెందిన పోలెపొంగు జగ్గయ్య – కృష్ణకుమారికి కుమార్తె లతతో పాటు కుమారుడు లక్ష్మణరావు ఉన్నారు. లత సుబ్లేడులోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి వరకు, ఐదు నుండి 10వ తరగతి వరకు వైరా ఎస్సీ బాలికల హాస్టల్‌లో చదివింది. ఆతర్వాత ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో, బీఎస్సీ అశ్వారావుపేటలోని అగ్రికల్చర్ కాలేజీలో, ఎమ్మెస్సీ (ప్లాంట్ పాథాలజీ) మహారాష్ట్రలో పూర్తిచేశాక హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంది. ఆపై అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికై తాను చదివిన అశ్వారావుపేటలోని అగ్రికల్చర్ కాలేజీలోనే పాఠాలు బోధిస్తోంది.

తొలి ప్రయత్నంలోనే...

ఓ పక్క అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తూనే లత అగ్రికల్చర్ సైంటిస్ట్ రిక్రూట్మెంట్ బోర్డ్(ఏఎస్ఆర్‌బీ) నిర్వహించే పరీక్షకు సిద్ధమైంది. ఈమేరకు తొలి ప్రయత్నంలో జాతీయ స్థాయిలో ఐదో ర్యాంకు సాధించింది. తద్వారా మొక్కలపై పరిశోధన కోసం శాస్త్రవేత్తగా ఎంపికవాలనే తన లక్ష్యాన్ని నెరవేర్చుకుంది. వచ్చే నెలలో ఐకార్‌లో శాస్త్రవేత్తగా ఆమెకు పోస్టింగ్ వచ్చే అవకాశముంది. ఈ సందర్భంగా మొక్కల వ్యాధి నివారణ, తక్కువ ఖర్చుతో రసాయన, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి అధిక, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించేలా పరిశోధనలు చేయాలన్నదే తన లక్ష్యమని లత వెల్లడించింది.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,413

లక్ష్యం చేరేనా?



భూగర్భ గనిలో ఉత్పత్తి చేస్తున్న కార్మికులు (ఫైల్)

- వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి దూరంగా సింగరేణి
- ఈ డిసెంబర్ నాటికి 3.03 మిలియన్ టన్నుల వెనుకంజ
- రోజుకు 2.85 లక్షల టన్నులు వెలికితీస్తేనే చేరువయ్యే అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్యాన్ని ఈ ఏడాది చేరుకోవడం కష్టంగానే ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, అక్టోబర్ నుంచి యాజమాన్యం ఉత్పత్తిపై సరైన దృష్టిసారించకపోవడంతో ఈ సారి వార్షిక లక్ష్యానికి దూరంలో నిలిచే అవకాశం ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సింగరేణి 2024–25లో నిర్దేశించుకున్న వార్షిక లక్ష్య సాధనకు ఇంకా 90 రోజుల గడువు ఉంది. గత 9 మాసాల్లో 50.08 మిలియన్ టన్నుల లక్ష్యానికి సుమారు 4 మిలియన్ టన్నులు వెనుకంజలో ఉంది. ఇటీవల సింగరేణి సీఎండీ 11 ఏరియాల్లోని 22 భూగర్భ గనులు, 18 ఓపెన్ కాస్ట్ గనుల్లో రోజుకు 2.70 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాలని జీఎంలకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ 2.38 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే సాధ్యమవుతోంది. గతేడాది కంటే ఓసీలు, భూగర్భ గనుల్లో ఈ ఏడాది ఉత్పత్తిలో వెనుబడి ఉంది. గతేడాది భూగర్భ గనుల్లో 59.31 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించగా ఈ ఏడాది డిసెంబర్ 30 నాటికి 43.54 లక్షల టన్నులు సాధించింది. ఓపెన్‌కాస్ట్‌లలో గతేడాది 640.90 లక్షల టన్నులు ఉత్పత్తి చేయగా, ఈసారి 446 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది లక్ష్యం చేరుకోవడం కష్టసాధ్యమని కార్మికులు చెబుతున్నారు.

ముందస్తు ప్రణాళికలు లేకనే?

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తీసుకోకపోవడం, 35 రోజులపాటు నిరవధికంగా వర్షాలు కురవడం, రోజుకు 500 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీయడం కారణంగానే ఉత్పత్తి తగ్గిందని పలువురు చెబుతున్నారు. వర్షాకాలం ముగిశాక అక్టోబర్ నుంచి ఉత్పత్తిపై యాజమాన్యం దృష్టి పెట్టకపోవడంతో సుమారు 4 మిలియన్ టన్నుల వెనుకంజలో ఉందని కార్మికులు అంటున్నారు. కొన్ని ఏరియాల్లో అధికారులు గనుల్లోకి దిగడం లేదని, కిందిస్థాయి అధికారులతో పర్యవేక్షిస్తున్నారని సమాచారం.

అధికారులు హడావుడి చేస్తున్నారు



కార్మికులను పని విషయంలో ఒత్తిడి చేస్తూ.. అధికారులు మాత్రం హడావుడి చేస్తున్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఒత్తిడితో పనిచేస్తున్నారు. ఆరంభం నుంచి సరైన ప్రణాళికలు ఉంటే, చివరికి ప్రశాంతంగా ఉంటుంది. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులపై ఒత్తిడి గురించి పట్టించుకోవటం లేదు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యయనం చేసేందుకు అధికారులు ఆస్ట్రేలియా వెళ్లి వచ్చారు గానీ, అక్కడ చేపడుతున్న చర్యలను ఇక్కడ అమలు చేయలేకపోయారు.

– రియాజ్‌అహ్మద్, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ

తెలంగాణ సాధనలో టీయూడబ్ల్యూజే కీలకపాత్ర



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో టీయూడబ్ల్యూజే కీలక పాత్ర పోషించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. సోమవారం ఆయన కొత్తగూడెంలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జర్నలిస్టులకు ప్రత్యేక నిధి సాధించింది కూడా తమ సంఘమేనని అన్నారు. రికార్డు స్థాయిలో 20,300పై చిలుకు అక్రిడిటేషన్లు అందించామని, కరోనా సమయంలో రూ.7 కోట్ల ఆర్థిక సాయం అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య తగ్గించడంతో పాటు డెస్క్ జర్నలిస్టులకు కార్డులను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఇళ్ల స్థలాల సమస్య ఆగిపోయిందని, కానీ ఈ సమస్యను వదిలిపెట్టేది లేదని అన్నారు. జిల్లాలోని జర్నలిస్టులకు అండగా ఉంటామని యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ హజారే, రాష్ట్ర కోశాధికారి యోగానంద్, జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మహమ్మద్ షఫీ, టెంజూ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కాగితపు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఐజేయూ సభ్యుడు చంద్ర నరసింహారావు, గుర్రం రాజేష్, టెంజూ జిల్లా అధ్యక్షుడు వట్టికొండ రవి, జిల్లా కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల వేతనాల చెల్లింపునకు చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: మెప్మా ఆర్పీలకు గౌరవ వేతనాల చెల్లింపుపై సీడీఎంఏ కీలక ఆదేశాలు జారీ చేసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఆర్పీల వేతనాలను ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ కమిషనర్లు చెల్లించాలని, ఆపై మెప్మా ద్వారా నిధులు విడుదల చేస్తామని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కేఎంసీ పరిధిలోని ఆర్పీల వేతనాలను చెల్లించేందుకు అధికారులు వారి హాజరు, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం ఏడు నెలల వేతనాలకు సంబంధించి కమిషనర్‌కు నివేదిక ఇవ్వనుండగా నిధులు విడుదల చేసే అవకాశముంది. అయితే, రీయింబర్స్‌మెంట్ విధానంలో వేతనాలు చెల్లించాక, ప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో ఆలస్యం జరిగితే మున్సిపాలిటీలపై భారం పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

మత్తుగా వీడ్కోలు పలికేలా!



వైరాలో గోదాం వద్ద లారీలో మద్యం లోడ్ చేస్తున్న సిబ్బంది

- ఒకేరోజు వైన్స్, బార్లకు రూ.25 కోట్ల విలువైన మద్యం
- ఈ ఏడాది రూ.2,308 కోట్ల సరుకు అమ్మకాలు
- గత ఏడాది పోలిస్తే రూ.60 కోట్లకు పైగా ఎక్కువ

వైరా: మద్యం అమ్మకాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏటా తన రికార్డులను తానే చెరిపేస్తోంది. రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరుగుతుండగా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం లభిస్తోంది. రెండేళ్ల కాల పరిమితిలో వైన్స్ దక్కించుకున్న వ్యాపారులు అమ్మకాల్లో పోటీ పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.2,308 కోట్ల మేర విలువైన మద్యాన్ని వైరాలోని డిపో ద్వారా వ్యాపారులు తరలించగా.. సోమవారం ఒకేరోజు రూ.25కోట్లకు పైగా విలువైన మద్యాన్ని తీసుకెళ్లడం విశేషం. దీంతో మంగళవారం పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సర స్వాగత సంబురాల్లో మద్యం ఏరులే పారే అవకాశం కనిపిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 210 వైన్స్, 48 బార్లతో పాటు మూడు క్లబ్‌లు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి డిసెంబర్ 30వ తేదీ నాటికి ఆయా వైన్స్, బార్లు, క్లబ్‌లకు వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి రూ.2,300 కోట్ల మద్యం తరలించారంటే అమ్మకాలు ఎలా జరిగాయో ఊహించుకోవచ్చు. ఇది గత ఏడాదితో పోలిస్తే రూ.60 కోట్ల మేర ఎక్కువని ఎక్సైజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కాగా, ఈ ఏడాది అమ్ముడైన మద్యంలో 29,063 మద్యం కేసులు, 19 లక్షల కేసుల బీర్లు ఉన్నాయి.

బెల్ట్ జోరు

జిల్లాలోని చాలా చోట్ల వైన్స్‌కు సమాంతరంగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. చాలాచోట్ల ఆయా షాపులను వైన్స్ యజమానులే ప్రోత్సహిస్తూ తమ షాపుల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో రాత్రింబవళ్లు అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే తమ ప్రైవేట్ సైన్యం ద్వారా బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వైన్స్ యజమానులు లక్ష్యం మేరకు డిపో నుంచి మద్యం తరలిస్తూ అటు వైన్స్, ఇటు బెల్ట్ షాపుల్లో అమ్మకాలు చేపడుతున్నారని తెలుస్తోంది.

ఇంకా పెరిగేవే కానీ...

ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్నాయి. అక్కడ గత ప్రభుత్వం మద్యం అమ్మకాలను నియంత్రించేందుకు పలు చర్యలు చేపట్టింది. దీంతో ఏపీ నుంచి మందుబాబు సరిహద్దులోని తెలంగాణకు వచ్చి మద్యం సేవించి వెళ్లేవారు. కానీ అక్కడ ఏర్పడిన కొత్త ప్రభుత్వం మద్యం అమ్మకాలను బార్లా తెరిచి అన్ని బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో అక్కడి నుంచి తెలంగాణలోకి వచ్చే వారు తగ్గిపోయారు. లేకపోతే ఇక్కడ మద్యం అమ్మకాలు మరింత పెరిగేవని తెలుస్తోంది.

నెల వారీగా డిపో నుంచి తీసుకెళ్లిన మద్యం విలువ

నెల	విలువ (రూ.కోట్లలో)
జనవరి	221
ఫిబ్రవరి	210
మార్చి	206
ఏప్రిల్	181
మే	237
జూన్	210
జూలై	180
ఆగస్టు	196
సెప్టెంబర్	185
అక్టోబర్	152
నవంబర్	135
డిసెంబర్ (30వ తేదీ నాటికి)	195
మొత్తం	2,308

రూ.1.12కోట్ల గంజాయి దహనం

ఖమ్మంక్రైం: భద్రాచలం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 449కేజీల గంజాయిని సోమవారం దహనం చేసినట్లు ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. కొద్దినెలలుగా 24కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఈ గంజాయి విలువ రూ.1.12 కోట్లుగా ఉంటుందని వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఖమ్మం సమీపాన గంజాయిని దహనం చేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేష్, భద్రాచలం ఎక్సైజ్ సీఐ రసూల్ ఉన్నిసాబేగం పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

పినపాక: మండలంలోని తోగూడెం అటవీ ప్రాంతంలో ఉన్న కోడి పందేల స్థావరాలపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పది మందిని అరెస్ట్ చేశారు. రూ.1,500 నగదుతోపాటు 9 బైకులు, కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

దమ్మపేట: మండల పరిధిలోని చీపురుగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. రెండు కోడి పుంజులు, రూ.1,750ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ట్రక్కు చోరీ

పాల్వంచరూరల్: నిలిపిఉన్న ట్రాక్టర్ ట్రక్కు, గొర్రు సెట్ చోరీకి గురయ్యాయి. మండల పరిధిలోని పాండురంగాపురానికి చెందిన రైతు చిట్యాల సుబ్బారెడ్డి తన ఇంటి సమీపంలోని షెడ్‌లో ఉంచిన ట్రాక్టర్ ట్రక్కు, గొర్రు సెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సాకేత్ (ఫైల్)

జూలూరుపాడు: ఖరీదైన సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఓ యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ బి.రవి కథనం ప్రకారం.. మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఇల్లంగి సాకేత్(21) ఖరీదైన సెల్‌ఫోన్ కొనివ్వాలని అడుగగా, తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. తండ్రి సంగీతరావు హమాలీ పనికి వెళ్లగా, తల్లి పని మీద బయటకు వెళ్లిన సమయంలో సాకేత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

ములకలపల్లి: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. కమలాపురం గ్రామానికి చెందిన పద్దం కన్నారావు (50) ఏ పనీ చేయకుండా మద్యం తాగి తిరుగుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం కూడా మద్యం తాగి ఇంటికి రాగా భార్య అనసూర్య మందలించింది. దీంతో క్షణికావేశానికి గురై గదిలోకి వెళ్లి, తలుపులు వేసుకున్నాడు. కుటుంబీకులు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా, కన్నారావు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. హుటాహుటిన పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మామ మందలించాడని.. వేడి నూనె పోసిన కోడలు

తీవ్రగాయాలతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స

కారేపల్లి: అస్తమానం బయట తిరగొద్దని మందలించిన మామపై కోపం పెంచుకున్న కోడలు ఆయన నిద్రిస్తున్న వేళ వేడి నూనె పోయడంతో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతున్నాడు. కారేపల్లి మండలం ఫైల్‌తండాలో చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. ఫైల్‌తండాకు చెందిన అజ్మీరా బాబు(60) కుమారుడు కోవిడ్ సమయాన మృతి చెందాడు. అ ప్పటి నుంచి ఆయన, కోడలు ఉమ, కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల ఉమ తరచుగా బయట తిరుగుతుండడంతో అది సరికాదని బాబు మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న ఆమె ఈనెల 28వ తేదీ రాత్రి బాబు నిద్రలో ఉన్న సమయాన వంట నూనె వేడి చేసి ఆయనపై పోసింది. ఈమేరకు ఆయన కేకలు వేయగా చుట్టుపక్కల వారు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

చనిపోయాడని ఫిర్యాదు

తీవ్రగాయాల పాలైన బాబు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా ఆయన మృతి చెందినట్లు అల్లుడు కారేపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ ఘటన వెలుగు చూడగా సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి సిబ్బందిని వరంగల్ పంపించారు. అక్కడ ఆస్పత్రిలో ఆరా తీయగా బాబు మృతదేహం ఆచూకీ లేకపోవడంతో వైద్యులను సంప్రదిస్తే ఆయన చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఈమేరకు తప్పుడు సమాచారం ఇచ్చిన బాబు అల్లుడిని మందలించిన పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్

డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని అంకిత్‌కుమార్‌కు ఆదేశాలు



విక్రాంత్ కుమార్ సింగ్

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఏఎస్పీ అంకిత్ కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఏడాది జూలై 1న భద్రాచలం ఏఎస్పీగా అంకిత్‌కుమార్‌ను నియమించగా, జూలై 3న ఆయన బాధ్యతలు చేపట్టారు. భద్రాచలంలో గోదావరి వరదలు, లాడ్జీల్లో రికార్డుల నిర్వహణ, గంజాయి అక్రమ రవాణా, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు, వినాయక నిమజ్జన సమయంలో భద్రతా చర్యలు చేపట్టడం, బ్రిడ్జి పాయింట్‌లోని చెక్ పోస్టు వద్ద నిఘా పెంచడం వంటి వాటిలో కీలకంగా వ్యవహరించిన అంకిత్‌కుమార్ మూడు నెలలు మాత్రమే విధులు నిర్వర్తించి ఆ తర్వాత ట్రైనింగ్‌కు వెళ్లారు. విధుల్లో ఉన్నది తక్కువ సమయమే అయినా శాంతిభద్రతలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారనే పేరు తెచ్చుకున్నారు.

63వ ఏఎస్పీగా విక్రాంత్ కుమార్..

భద్రాచలం 63వ ఏఎస్పీగా విక్రాంత్‌కుమార్ సింగ్ నియమితులయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన మహేందర్‌సింగ్, మంజులా సింగ్ దంపతులకు 1993 ఫిబ్రవరి 22న జన్మించారు. ఆయన తండ్రి జిల్లా జడ్జిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తల్లి మంజులా సింగ్ గృహిణి. సోదరుడు ప్రశాంత్ సింగ్ బనారస్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి వరకు కాన్పూర్, ఆగ్రాలో, 10, 11 తరగతులు ముజాఫనగర్‌లో చదివారు. 2015లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. 2015లో ఎస్‌బీఐ పీఓగా ఎంపికయ్యారు. 2016 నుంచి రెండుసార్లు సివిల్స్‌కు ప్రయత్నించి, 2019 నుంచి 2021 వరకు ఐసీఏఎస్(ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్), ఐఏఏఎస్ (ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీస్)లో ఎంపికయ్యారు. మూడోసారి సివిల్స్‌కు ప్రయత్నించి 2022లో 526వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసి ప్రొబెషనరీ విధుల నిర్వహణకు జనవరి 8న జిల్లాకు వచ్చారు. జిల్లాలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, మార్చి 4 నుంచి మే 25 వరకు లక్ష్మీదేవిపల్లి ఎస్‌హెచ్‌ఓగా చేశారు. ట్రైనింగ్ కోసం తిరిగి జాతీయ పోలీస్ అకాడమీకి వెళ్లారు. కాగా, ఆయనను భద్రాచలం ఏఎస్పీగా నియమిస్తూ డీజీపీ జితేంద్ర ఆదేశాలు జారీ చేశారు.

కష్టపడి పనిచేస్తేనే సంస్థ మనుగడ

సింగరేణి డైరెక్టర్ (పీపీ అండ్ పా) వెంకటేశ్వరరెడ్డి



సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సంస్థ మరికొంత కాలం మనుగడ సాగించాలంటే అందరూ కష్టపడి పనిచేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్, అండ్ పా) జి. వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లిన సమయంలో కార్మికులు సంస్థను భుజస్కంధాలపై పెట్టుకుని పనిచేశారని, ప్రస్తుతం కూడా అదే తరహాలో పనిచేయాలని సూచించారు. నిత్యం బదిలీలు, డిప్యూటేషన్లకు దరఖాస్తు పెట్టుకోవడం సరికాదని అన్నారు. ఈ ఏడాది కొంత ప్రక్షాళన చేయాలని కంపెనీ భావిస్తోందన్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7 ఓసీకి రావాల్సిన ఈసీ అనుమతుల్లో మరో మూడు నెలల జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో అక్కడి ప్రభుత్వ అనుమతి రాగానే చెట్లను తొలగించే ప్రక్రియ, ఓబీ పనులు చేపడతామని వివరించారు. కార్మికులు, అధికారులు విధిగా 8 గంటలపాటు పనిచేయాలన్నారు. కంపెనీ యంత్రాల పనితీరును మెరుగుపర్చాలని చెప్పారు. టైమ్ మేనేజ్‌మెంట్ కమిటీతో సంప్రదింపులు చేస్తున్నామని, త్వరలో పనివేళల మార్పు చేసేందుకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. రక్షణ సూత్రాలు పాటిస్తే గనుల్లో ప్రమాదాలు జరగని చెప్పారు. మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ఉద్యోగాలు పొందుతున్న కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నారని తెలిపారు. 2024 అక్టోబర్ వరకు కనీసం 75 మస్టర్లు చేయని వారు సంస్థ వ్యాప్తంగా సుమారు 3 వేల మంది వరకు ఉన్నారని తెలిపారు. నూతన సంవత్సరంలో విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ వార్షిక ఉత్పత్తి లక్ష్యం 72 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీతకు కృషి చేయాలని సూచించారు.

డిగ్రీ హాస్టల్ భవనానికి మోక్షమెప్పుడో..?

జూన్‌లో మంజూరైన రూ.10 కోట్లు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాల్వంచరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాస్టల్ భవన సముదాయ నిర్మాణ పనులకు మోక్షం కలగడంలేదు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఉచ్చతార్ శిక్ష అభియాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం గత జూన్‌లో రూ. 10 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షణలో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. రూ.7.5 కోట్ల వ్యయంతో సివిల్ పనులు, మరో రూ. 2.5 కోట్లతో డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్ ఫర్నిచర్ కొనుగోలు చేపట్టనున్నారు. ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో విద్యార్థులు నిరాశ చెందుతున్నారు.

అగ్రిమెంట్ జరగాల్సి ఉంది

డిగ్రీ కళాశాల ఇంటి గ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత పనులు ప్రారంభించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తాం.– నాగేశ్వరచారి(టీ.జీ.ఈడబ్ల్యూఐడీసీ డీఈ)